GLOBAL TELUGU CHRISTIAN MINISTRIES

# NEWS LETTER

For Private Circulation only
March - April 2016

**ప్రియమైన జీటీసీయెమ్మర్స్,**

ప్రభువైన యేసుక్రీస్తునామంలో మీకు శుభాలు. అనేకమార్లు మనమంతా జీటీసీయెమ్మర్స్‌గా కలుసుకోడానికి ఈ న్యూస్ లెటర్ ఉపయుక్తంగా ఉంటున్నందుకు దేవునికి స్తోత్రాలు. జెరూసలేం కాన్ఫరెన్స్ తరువాత మనలో కొందరు ఒక వాట్సాప్ గ్రూప్ తయారు చేసి దాన్ని బాగానే వినియోగించుకుంటున్నారు. ఇది మంచి ఏర్పాటే. ఈ గ్రూపు డబ్ల్యూటీసియెస్ – లండన్ 2016 కొరకు ఒకరినొకరు ప్రోత్సహించుకోడానికి వినియోగిస్తే మరి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుందని అనుకుంటున్నాను.

లండన్ కాన్ఫరెన్స్ గూర్చి జీటీసీయెమ్ సీరియస్‌గా ఆలోచిస్తోంది; ప్రయత్నిస్తోంది. లండన్‌కు ఎక్కువమంది రావాలనీ, దీవింపబడాలనీ ఆశిస్తూ అందరికీ అనుకూలమైన ఏర్పాట్లు చెయ్యడానికి ప్రయత్నిస్తోంది. ప్రయత్నాల ఫలితాలను త్వరలోనే ప్రకటిస్తాం.

## ఈ మాసం గ్రాసం

హబక్కూకు 2:14 “సముద్రము జలములతో నిండియున్నట్లు లోకము యెహోవాను గూర్చిన జ్ఞానముతో నిండియుండును”.

మిషన్స్ పరిచర్య, సువార్త ప్రకటన సంఘము యొక్క ప్రాథమిక బాధ్యత అని మనం ఎరుగుదుము. మత్తయి భక్తుడు ఇతియోపియాకూ; మార్కు ఈజిప్టుకు; లూకా, బర్తిలోమయి గ్రీసుకు; జాన్ టర్కీకి, తోమా భారతదేశానికి; పౌలు, సీల ఆసియాకు, యూరప్‌కు వెళ్ళి మిషన్స్ పరిచర్య చేసారు. పేతురు, యేసు సహోదరుడైన యాకోబు, జెబెదయి కుమారుడైన యాకోబు జెరూసలేం సంఘాన్ని బలపరిచారు.

డేవిడ్ లివింగ్‌స్టన్ ఆఫ్రికా వెళ్ళాడనీ, విలియం కేరి ఇండియా వచ్చాడనీ, అధోనిరామ్ జడ్సన్ బర్మా (మయన్మార్) వెళ్ళాడనీ చదువుతాం, బోధిస్తాం. సండేస్కూల్లో మనం చెప్పే భక్తుల చరిత్రలు మన బిడ్డలను సన్మార్గం వైపు ప్రభావితులను చెయ్యాలని ఆశిస్తాం. ఒకవేళ నా బిడ్డే డేవిడ్ లివింగ్‌స్టన్ చరిత్రతో ప్రభావితుడై ఒక నిర్ణయం తీసుకుంటే నేనేం చేస్తాను?? జీగెన్‌బాగ్, బెంజమిన్ షుల్జ్, ఫాదర్ హైయర్, అలెగ్జాండర్, జాన్ మెక్లారిన్‌లు మిషన్స్ పనికి మన ప్రాంతాలను ఎంచుకొని శ్రమించారు. రెండువందల సంవత్సరాలకు పూర్వం మిషనరీలు ఎక్కడ సువార్త చెప్పారో, ఎక్కడ సువార్త చెప్పి సంఘాలను స్థాపించారో అక్కడనే సంఘ నిర్మాణాలు (మందిర నిర్మాణాలు కాదు) పరిమితమైపోవాలా లేక ప్రభువుకు ప్రపంచమంతా కావాలా? అలానైతే భారతక్రైస్తవ సంఘం ఎన్ని దేశాలకు ఎంత మంది మిషనరీలను పంపింది? ప్రియమైన మన దేవుని మహా ఆజ్ఞకు నీ సంఘం ప్రతిస్పందన ఏమిటి?

భక్తులను గౌరవించే సాంప్రదాయం మనది. వారి పేర్లు అభిమానంతో మన బిడ్డలకు పెట్టుకుంటాం. మన బిడ్డలొకవేళ వారి పేరుకు తగ్గట్టు జీవించాలని నిర్ణయించుకొంటే మన స్పందన ఏమిటి? పేర్లంటే గౌరవమా? ఆ పేర్లుగల వ్యక్తులు సాధించిన పరిచర్యలంటే గౌరవమా??

వనరులు సమకూర్చుకొని యదార్థమైన పరిచర్యలు భారతదేశంలో ఉన్నాయి. దేశీయ విధానాల్లో దేశీయ వనరుల మీద ఆధారపడి మిషన్స్ పని దిగ్విజయంగానూ, ఫలభరితంగానూ చేసే సంస్థలూ ఉన్నాయి. ఈ పరిచర్యలు మనకేమైనా మాదిరిగా ఉంటున్నాయా? మన దేశం గూర్చి మనకు భారం ఉంటే మన ప్రజలకు అనుకూలమైన విధంగా సువార్త ప్రకటన/ప్రచురణ పనిచేద్దామా; లేక మనం నేర్చుకొన్న పద్ధతులకే ప్రజలు విధేయత చూపాలని కోరుకొందామా?

మనదేశ ప్రజల గూర్చి ప్రభువు మనకు భారం కల్పిస్తే సువార్త ప్రతీ ఇంటి ముంగిటికి – అనగా ప్రజల గృహాల్లోనికి, గూడేల్లోనికి తీసుకువెళ్ళగల ప్రయత్నం మనం చెయ్యాలికదా!

మన క్రైస్తవ్యానికీ, పరిచర్యలకూ మన కార్యక్రమాలను కొలబద్దలుగా తీసుకొందామా లేక దేవుని పరిపూర్ణ సంకల్పాన్నెరిగి విధేయత చూపటమో డిసైడ్ చేసుకొందామా!

మనం సువార్తను ఎక్కడెక్కడికి మోసుకుపోతే అక్కడ దేవుడు “భూదిగంతముల నివాసులారా, నావైపు చూచి రక్షణ పొందుడి. దేవుడను నేనే. మరి ఏ దేవుడును లేడు – నా యెదుట ప్రతి మోకాలు వంగుననియు, ప్రతి నాలుకయు నా తోడని ప్రమాణము చేయుననియు నేను నా పేరట ప్రమాణము చేసియున్నాను. నీతి గల నా నోటి మాట బయలుదేరియున్నది. అది వ్యర్థం కాదు” అని చెప్పగలడు (యెషయా 45:22-23).

ప్రభువుకు ప్రపంచమంతట ఈ అవకాశం మనమే ఏర్పాటు చెయ్యాలి. ఎందుకంటే “సముద్రము జలములతో నిండియున్నట్లు లోకము యెహోవాను గూర్చిన జ్ఞానముతో నిండియున్నది”.

–రూఫస్

# బైబిల్ కాలం తర్వాత ఇశ్రాయేల్ చరిత్ర
## (గత సంచిక తరువాయి)

ప్రియనాథ్ రూఫస్, రాజమండ్రి

**3. పెర్షియన్ కాలం ( 614 – 634):**

ఖుస్రోస్ ది సెకండ్ (రెండవ ఖుస్రోస్) అనే పెర్షియన్ యోధుడు 614 మే 20 వ తేదీన దండెత్తి జెరూసలేంను, పలెస్తీన్‌ను స్వాధీన పరచుకొన్నాడు. 3,40,000 మంది ప్రజలు హతులయ్యారు. క్రైస్తవ దేవాలయాలు సమూలంగా కూల్చివేయబడ్డాయి. ఖుస్రోస్ యూదులకు క్రైస్తవులనుండి స్వేచ్ఛను కల్పిస్తానని చేసిన వాగ్దానాన్ని బట్టి అతని దండయాత్రను యూదులు ప్రోత్సహించారు. కానీ ఖుస్రోస్ తన మాట నిలబెట్టుకోలేదు. కాన్స్టంటైన్ తల్లి హెలీనా పలేస్తీను పర్యటనలో సంపాదించుకొన్న యేసుక్రీస్తును సిలువ వేసిన సిలువను తీసుకుపోయాడు. తిరిగి 629లో బైజాంటైన్లు హిరాక్లియస్ చక్రవర్తి నాయకత్వంలో పోగొట్టుకొన్న రాజ్యాన్ని తిరిగి సంపాయించుకొని నిజమైన సిలువను జెరూసలేంకు తీసుకువచ్చారు.

**4. అరబ్‌ల కాలం (634 – 1072):**

మొహమ్మద్ ప్రవక్త క్రీ.శ 570 లో మక్కాలో జన్మించాడు. అతని చిన్నాన్న అబూ తలేబ్ సంరక్షణలో ఎదిగి, ఖదీజా అనే వ్యాపారస్తురాలి దగ్గర పనిచేసి, ఆమె భర్త మరణానంతరం ఆమెనే వివాహమాడాడు. 611 లో తన నలభయ్యవ ప్రాయంలో దర్శనం పొంది “అల్లా తప్ప మరే దేవుడు లేడు. మొహమ్మద్ దేవుని ప్రవక్త” అనే స్వరం విని నూతన మతాన్ని ఆవిష్కరించాడు. అప్పటికి అరేబియన్ పెనిన్సులాలో 360 మంది దేవుళ్ళున్నారు. వారిలో ప్రధానుడు అల్లా. 632 లో మొహమ్మద్ మెదీనాలో మరణించాడు.

637లో అరబ్ ఆర్మీ జనరల్ ఒమర్ జెరూసలేంను ముట్టడించి “దేవుడొక్కడే. ఆయన ప్రవక్త మొహమ్మద్”. ఈ సత్యాన్ని ఒప్పుకోకపోతే అరబ్‌లకు కప్పం కట్టి పూర్తిగా అరబ్బులకు లొంగి వుండాలి. లేకపోతే మీరు ద్రాక్షారసాన్ని ప్రేమించేకంటే మరణాన్ని ప్రేమించే నా సైనికులను తీసుకొస్తానని ప్రకటించాడు. జెరూసలేం అరబ్బుల హస్తగతమైంది.

1009 లో చర్చ్ ఆఫ్ ద హోలీ సెపల్కర్‌ను, సుమారు 30 వేలమంది క్రిస్టియన్ గృహాలను కూల్చివేశారు.

**5. సెల్జుక్ కాలం (1072 – 1099):**

సెల్జుక్స్ అనేవారు టర్కీకి చెందిన వారు. వీరుకూడా ముస్లింలే. 1076 లో వీరు జెరూసలేం మీద, పాలేస్తీను మీద దండెత్తి గెలిచారు. వీరు కేవలం 25 సంవత్సరాలు మాత్రమే జెరూసలేం మీద పట్టు కలిగివున్నారు. తరువాత వీరిని ఈజిప్షియన్స్ తరిమేశారు.

**6. క్రూసేడ్స్ కాలం (1099 – 1291):**

చరిత్రలో రక్తంతో రాయదగిన కాలమిది. యేసుక్రీస్తు పేర ఆయన నామం ధరించినవారు మతం పేరిట చేసిన యుద్ధాలను క్రూసేడ్స్ అంటారు. ఈ క్రూసేడ్స్ జెరూసలేంను, క్రిస్టియన్స్‌ను అరబ్బుల బారి నుండి కాపాడడానికి చేయబడిన యుద్ధాలు. మొత్తం ఎనిమిది యుద్ధాలు యూరప్‌లో నున్న క్రిస్టియన్ రాజులకు, ముస్లిమ్స్‌కు మధ్య జరిగాయి. లక్షలమంది క్రిస్టియన్ సోల్జర్స్ అసువులుబాసారు. క్రిస్టియన్ శక్తి హేళన చేయబడింది. ఈ క్రూసేడ్స్ రోమన్ పోప్‌ల ప్రోత్సాహంతో జరిగాయి.

**7. మమేలుక్ కాలం (1291 – 1517):**

మమేలుక్‌లు ఈజిప్ట్ దాస్యంలో నున్న టర్కిష్ బానిసలు. వీరు ఈజిప్ట్ రాజులకు బాడీగార్డ్స్‌గా పనిచేసేవారు. వీరు తగినంత బలవంతులై ఈజిప్ట్ రాజుల మీద తిరుగుబాటు చేసి దాన్ని పట్టుకొన్న తరువాత పలేస్తీన్ వెళ్లి క్రూసేడర్స్‌ను తరిమివేశారు. మమేలుక్ కాలంలో యూదులూ, క్రిస్టియన్స్ కూడా విపరీతమైన హింసకు లోనయ్యారు. వీరు యూదులకు పసుపు రంగు తలపాగా, క్రిస్టియన్లకు నీలం రంగు తలపాగాలూ ధరింపజేసి ముస్లిమ్స్‌కు బానిసలుగా జీవింప జేశారు. అదే సమయంలో జెరుసలేం ప్రాంతంలో కఠినమైన కరువు సంభవించి పిల్లుల్ని, కుక్కల్ని, చెదపురుగుల్ని, తమ చిన్న పిల్లల్ని కూడా వంట చేసుకొని భుజించారు.

## 8. ఒట్టమాన్ టర్కిష్ కాలం (1517 - 1917):

1517 లో టర్కీకి చెందిన మొదటి సెలిం మమేలుక్‌లను ఓడించి పలేస్తీన్‌ను స్వాధీనం చేసుకొన్నాడు. దీనికి ముందే 1453లో ఒట్టమాన్ టర్క్స్ కాన్స్టాంటినోపుల్‌ను కూడా తమ హస్తగతం చేసుకొన్నారు. మొదటి సెలిం కుమారుడు సెలిమాన్ (Selyman the Magnificent) 1520 నుండి 1566 వరకు పరిపాలించి 400 ఏళ్ళ ఒట్టమాన్ టర్క్స్ పరిపాలనలో గొప్ప రాజుగా ప్రఖ్యాతి సాధించాడు. యితడు జెరూసలేం గోడలను పునర్నిర్మించాడు. ఇప్పుడున్న శిధిలాలు ఇతను నిర్మించిన గోడలే. సెలిమాన్ తరువాత చాలామంది గవర్నర్స్ పలేస్తీన్‌ను పాలించారు. వీరందరూ కూడా టర్కీ సుల్తాన్‌కు భారీ మొత్తంలో లంచమిచ్చి పరిపాలనలోకి వచ్చినవారే. వీరి కాలంలో యూదులు, క్రిస్టియన్స్, ముస్లిమ్స్ కూడా సమానంగా దుర్భరమైన జీవితం జీవించాల్సి వచ్చింది.

1798లో ఫ్రాన్స్ వాడైన నెపోలియన్ బోనపార్ట్ దండెత్తి 30,000 మంది సైనికులూ, అధిక సంఖ్యలో ఓడలతో బయల్దేరి ఈజిప్ట్‌ను పట్టుకొన్నాడు. పలేస్తీన్‌ను సంపాదించి యూదులకిస్తానని వాగ్దానం చేసినందువలన అప్పటికి 665 సంవత్సరాల క్రితం బార్ కొచ్బా విషయంలోలానే నెపోలియన్ బోనపార్ట్‌ను మెస్సీయ అనుకోని యూదులు భ్రమపడ్డారు. నెపోలియన్ గాజా, జాఫ్ఫా, సెజారియాలను స్వాధీనం చేసుకొన్నాడు. 3000 యుద్ధ ఖైదీలను జాఫ్ఫా బీచ్‌లో నిర్దాక్షిణ్యంగా చంపి తన క్రూరత్వాన్ని చాటుకొన్నాడు. జెజ్రయిల్ లోయలో టర్కీ ఆర్మీ ఎదిరించిన వారిని కూడా మౌంట్‌టాబోర్ వద్ద నెపోలియన్ ఓడించాడు. పలేస్తీన్‌లో ప్రముఖ కేంద్ర పట్టణమైన ఆక్రేను నెపోలియన్ జయించాలనుకొన్నాడు కానీ టర్కిష్ ఆర్మీ, బ్రిటిష్ ఆర్మీ దాన్ని నెపోలియన్‌కు చిక్కకుండా చేశాయి.

1838లో బ్రిటిష్ వారు తమ కాన్సులేట్‌ను జెరూసలేంలో నెలకొల్పారు. అలానే ఫ్రాన్స్, ప్రష్యా, ఆస్ట్రియా, స్పెయిన్‌లు తమ తమ కాన్సులేట్స్ ప్రారంభించాయి. ప్రోటస్టంట్స్, కేతలిక్స్, యూదులు కూడా తమ తమ మిషన్ సెంటర్స్‌ను ఏర్పాటుచేసుకొన్నారు. యూద జనాభా క్రమేణా పెరగడం ప్రారంభమయింది.

1853లో క్రిమియా యుద్ధం ప్రారంభమైంది. రష్యా పలేస్తీన్ మీద పట్టుసాధించాలనే ఆశతో టర్కీ మీదకు దూసుకు వచ్చింది. టర్కీ ఫ్రాన్స్, ఇంగ్లాండ్ దేశాల సహాయాన్ని కోరింది. రష్యా ఓడిపోయింది. 1878లో ఎలియజర్ బెన్ యెహోదా అనే పేరిస్ (ఫ్రాన్స్)లో కాందిశీకుడైన యూదుడు దేవుడు తనకు దర్శనమిచ్చి హీబ్రూ భాషను ప్రోత్సహించమన్నాడని చెప్పి తన భార్యతోనూ, ప్రజలతోనూ కూడా హీబ్రూలో తప్ప వేరే భాషలో సంభాషించనని శపథం చేశాడు. తన ప్రజలనుండి తీవ్రమైన వ్యతిరేకతను రుచి చూచాడు. ఇంతలో ప్రపంచప్రసిద్ధ యూదుడు థియోడార్ హెర్జల్ యెహూదా గూర్చి తెలుసుకొని అతణ్ణి ప్రోత్సహించాడు.

యెహూదాకు పరిస్థితులు మెరుగయ్యాయి. బెన్ యెహూదాను ఒక హీరోగా గుర్తించడం మొదలైంది. జర్మనీలోనూ, ఇతర యూరోపియన్ దేశాల్లోనూ యూదులు తమ స్కూళ్ళలో హీబ్రూ టీచింగ్ ప్రారంభించారు. బెన్ యెహూదా 8 సంపుటల డిక్షనరీ తయారు చేశాడు. అలా మృతమైన హీబ్రూ భాషకు మరలా ప్రాణం వచ్చింది.

క్రీ.శ. 132లో బార్ కొచ్బా తిరుగుబాటు తరువాత మరో గొప్ప తిరుగుబాటు 1897 లో వచ్చిందని చెప్పాలి. ఆస్ట్రియన్ యూదుడు థియోడార్ హెర్జల్ స్విట్జర్లాండ్ లో బేసల్ నగరంలో ఆగస్ట్ ఇరవై తొమ్మిదో తేదీన ఒక సదస్సు ఏర్పాటు చేశాడు. యూరప్, ఆఫ్రికా, అమెరికా, పలేస్తీన్ నుండి 204 మంది యూద ప్రముఖులు పాల్గొన్న ఆ సదస్సులో జయోనిజం మూమ్మెంట్ ఆవిష్కరించబడింది. వీరి స్లోగన్: “దేర్ ఈజ్ ఎ లేండ్ విదౌట్ ఎ పీపుల్; దేర్ ఈజ్ ఎ పీపుల్ విదౌట్ అ లేండ్. గివ్ ద లేండ్ విదౌట్ ఎ పీపుల్ టు ద పీపుల్ విదౌట్ ఎ లేండ్”. “ఒక ప్రజ లేని దేశం వున్నది; ఒక దేశం లేని ప్రజ వున్నది. దేశంలేని ప్రజకు ప్రజ లేని దేశాన్ని ఇవ్వండి”. ఈ సదస్సు ప్రపంచ వ్యాప్తంగా చెదరి వున్న యూదులకు భవిష్యత్తును గూర్చిన ఆశను కల్పించింది. ఆ సదస్సులోనే ఇశ్రాయేల్ జెండాను, జాతీయ గీతాన్నీ పరిచయం చేయడం జరిగింది.

హెర్జల్ రష్యా, గ్రేట్ బ్రిటన్, ఇటలీ, జర్మనీలు దర్శించి రాజకీయ నాయకుల్ని కలిసాడు. పోప్‌ని కూడా కలిసి మాట్లాడాడు. పశ్చిమాసియాలో కూడా విస్తృతంగా పర్యటించాడు. తుదకు కాన్స్టాటినోపుల్ వెళ్లి టర్కీ సుల్తాన్‌ని కలిసాడు. సుల్తాన్ 20 మిలియన్ డాలర్లిస్తే యూదులను పలేస్తీన్ లోనికి అనుమతిస్తానన్నాడు.

ఈ విషయం ఒక కొలిక్కి రాకముందే జూలై 3, 1904 లో థియోడార్ హెర్జల్ కన్నుమూశాడు.

పందొమ్మిదో శకాంతానికి పలేస్తీన్లో తురుష్కులమీద ఏవగింపు తారాస్థాయికి చేరుకొంది. అరబ్బులచే రేపబడిన యంగ్ టర్క్ రివల్యూషన్ ప్రారంభమైంది. 1914లో ఆస్ట్రియా, జర్మనీలు కలిసి సెర్బియా మీద యుద్ధాన్ని ప్రకటించాయి. బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, ఇటలీ, సెర్బియాకు మద్దతు ప్రకటించాయి. ఈ యుద్ధంలో టర్కీ జర్మనీతో చేతులు కలిపింది. ఇంతలో జూన్ 9, 1916లో అరబ్బులు టర్కీ మీద తిరుగుబాటు చేశారు. బ్రిటిష్ ఆర్కియాలజిస్ట్ థామస్ ఇ. లారెన్స్ అరబ్బులను బలపరిచాడు. బ్రిటిష్ వారితో యుద్ధంలో సహకరించడానికి 2,00,000 మంది అరబ్బులతో సైన్యాన్ని సమకూర్చాడు. యుద్ధ ప్రణాళికలు కొత్తపుంత తొక్కడం మొదలైంది. యూరప్ రాజ్యాల మధ్య ప్రారంభమైన ఈ యుద్ధం ప్రపంచమంతటికి ప్రాకి మొదటి ప్రపంచ యుద్ధంగా మారింది.

(సశేషం)

## ఫిబ్రవరి మాసంలో జరిగిన జీటీసీయెమ్ ప్రమోషనల్ మీటింగ్స్

దేవుని మహాకృపలో ఫిబ్రవరి 2వ తేది రాజమండ్రిలోనూ, 3వ తేది బెండపూడిలోనూ, 4వ తేది మచిలీపట్నంలోనూ, 5వ తేది ఒంగోలులోనూ, 6వ తేది కావలిలోనూ, చివరిగా 9వ తేది చెన్నైలో జీటీసీయెమ్ ప్రమోషనల్ మీటింగ్స్ జరిగాయి. ఈ ప్రాంతాల్లో స్థానిక సంఘ నాయకులు మరియు జీటీసీయెమ్ శ్రేయోభిలాషుల సహకారంతో ఈ మీటింగ్స్ జరిగాయి. ఈ మీటింగ్స్‌లో జీటీసీయెమ్ తరఫున వైస్ ప్రెసిడెంట్ రెవ॥ డా॥ జోసఫ్ పాతూరి గారు, ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ రెవ. ప్రియనాథ్ రూఫస్ గారు, పాస్టర్ దేవిడ్ చక్రనారాయణ్ గారు, యు.ఎస్.ఎ. మరియు నేషనల్ డైరెక్టర్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ రెవ. పెర్సిహిరామ్స్ గారు పాల్గొని జీటీసీయెమ్ దర్శనాన్ని వివరించి చక్కని వాక్య పరిచర్య చేశారు. సహకరించిన వారందరికి జీటీసీయెమ్ కృతజ్ఞతలు తెలుపుతోంది.


రాజమండ్రి


బెండపూడి


మచిలీపట్నం



ఒంగోలు


కావలి


చెన్నై

వచ్చే నెలలో మరోమారు కలసికొనే వరకు ఒకరినిమిత్తం ఒకరం ప్రార్థించుకొందాం.
దేవుని కృప మీకు తోడైయుండి ఆశీర్వదించును గాక.

క్రీస్తులో మీ సహదాసుడు **రెవ. ప్రియనాథ్ రూఫస్,** ఎక్జిక్యూటివ్ డైరెక్టర్
ఫోన్ : 09494908413, 09848978222 ఈ మెయిల్ : rufus1410@gmail.com
**జి.టి.సి.ఎం. అడ్రస్ :** 11-115, చాపరాల వారి వీధి, అశోక్ నగర్, విజయవాడ-520007. ఫోన్: 0866-2555687.
మేనేజర్: 98660 83001